వైసిపి పాలనలో గ్రామాలాభివృద్ధి : ఎంఎల్ఎ



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

గణపవరం: వైసిపి పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు తెలిపారు. శనివారం పిప్పరలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పిప్పరలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వైఎస్ఆర్ చేయూత కార్యక్రమంలో పాల్గొన్నారు చిలకంపాడులో సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు కాకర బేబీ, చుక్కా అప్పారావు, మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు, వైసిపి కన్వీనర్ దండు రాము పాల్గొన్నారు.

'పొత్తు' ఫలించేనా..!

- టిడిపి, జనసేనలో ఆరని అసమ్మతి సెగలు
- ఎన్నికల్లో సహకరించేది లేదంటూ నాయకుల ఫీంకారాలు
- ఓట్లు బదలాయింపు జరిగేనా అంటూ తీవ్ర చర్చ
- ఉంగుటూరు, పోలవరం, తాడేపల్లిగూడెంల్లో ఇదే పరిస్థితి
- బిజెపి సీట్లు ప్రకటిస్తే మరో రచ్చ ఖాయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో టిడిపి, జనసేన పొత్తు ఫలించేనా అనే చర్చ సాగుతోంది. ఎన్నికల్లో ఓట్ల బదలాయింపు జరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టిక్కెట్ల కేటాయింపు తర్వాత టిడిపి, జనసేనలో చోటుచేసుకున్న పరిణామాలు అందుకు అద్ధం పడుతున్నాయి. టిడిపి, జనసేన నాయకుల అసమ్మతి రాగాలు ఏ పరిస్థితికి దారి తీస్తాయోననే ఆందోళన ఆయా పార్టీల నాయకుల్లో వ్యక్తమవుతోంది. 2024 సాధారణ ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తుతో ముందుకు సాగాలని ఆ పార్టీ అధినాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నిర్ణయించారు. టిడిపి, జనసేన పొత్తును రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వాగతించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా టిక్కెట్ల కేటాయింపు ప్రకటన తర్వాత పరిస్థితి తారుమారైంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. టిడిపి, జనసేన అభ్యర్థుల తొలి జాబితాలో ఏడు స్థానాలను టిడిపి ప్రకటించింది. తణుకు సీటు టిడిపి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణకు కేటాయించడంతో జనసేన టిక్కెట్ ఆశించిన విడివాడ రామచంద్రరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాడేపల్లిగూడెంలో జరిగిన టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల సభ ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ బస వద్ద ఆయన తన అనుచరులతో ఆందోళనకు సైతం దిగారు. విడివాడకు అన్యాయం చేశారని, టిడిపికి సహకరించేది లేదని నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఏలూరు సీటు టిడిపి అభ్యర్థి బడేటి చంటికి కేటాయించడంతో జనసేన టిక్కెట్ ఆశించిన రెడ్డి అప్పలనాయుడు ఇదే విధమైన నిరసన తెలిపారు. వీరు ఇరువురు వచ్చే ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో జనసేన ఓట్లు టిడిపికి బదలాయింపు జరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాయకులు ఎన్ని ఓట్లు చీల్చినా అవి పార్టీకి సంబంధించిన ఓట్లే కావడం వల్ల గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అభ్యర్థుల రెండోజాబితా ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అయితే రెండు జిల్లాల్లో మిగిలిన ఏడు స్థానాల్లో నరసాపురం, భీమవరం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, పోలవరం మొత్త ఐదుస్థానాలు జనసేనకు కేటాయించినట్లు స్పష్టత వచ్చింది. ఈ స్థానాల్లో టిడిపి టిక్కెట్ ఆశిస్తున్న వారితో శుక్రవారం చంద్రబాబు ఢిల్లీ నుంచి మాట్లాడి బుజ్జగించే ప్రయత్నం చేశారు. టిక్కెట్ రాకపోవడంతో ఉంగుటూరు నేత గన్ని వీరాంజనేయులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. గత ఎన్నికల్లో ఇక జనసేన అభ్యర్థికి పదివేల పైచిలుకు ఓట్లు మాత్రమే వచ్చాయి. టిడిపి అభ్యర్థి గణనీయమైన ఓట్లు సాధించారు. టిడిపి ఓట్లన్నీ జనసేనకు బదిలీ అయితేనే జనసేన అభ్యర్థి గెలిచే అవకాశం ఉంటుంది. తీవ్ర అసంతృప్తిలో ఉన్న టిడిపి నేతలు జనసేన అభ్యర్థికి సహకరిస్తారా.. ఓట్లు బదిలీ జరిగేలా ప్రచారం నిర్వహిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. పోలవరం టిక్కెట్ జనసేనకు కేటాయించినట్లు స్పష్టత వచ్చింది. టిడిపి టిక్కెట్ ఆశిస్తున్న బొరగం శ్రీనివాస్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. శనివారం పోలవరం నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు బుట్టాయిగూడెంలో సమావేశమై పోలవరం టిక్కెట్ కేటాయింపుపై సరైన నిర్ణయం తీసుకోవాలని, ఐదు శాతం ఓట్లులేని జనసేనకు ఏవిధంగా కేటాయిస్తారని అంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీటు బొరగం శ్రీనివాస్‌కు కేటాయించకపోతే ఎన్నికల్లో సహకరించేది లేదన్నట్లు హెచ్చరికలు జారీచేశారు. దీంతో ఎన్నికల్లో పొత్తు ఫలించేనా అనే అనుమానం వ్యక్తమవుతోంది. తాడేపల్లిగూడెం టిక్కెట్ జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌కు కేటాయించినట్లు స్పష్టత రావడంతో టిడిపి టిక్కెట్ ఆశించిన వలవల బాబ్జీ తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. నాయకుల మాటలను పరిశీలిస్తే ఎన్నికల్లో జనసేనకు ఇక్కడ టిడిపి నాయకుల నుంచి సహకారం ఉంటుందా అనే మీమాంస నెలకొంది. టిడిపి, బిజెపి, జనసేన పొత్తు ఖాయమవ్వడంతో బిజెపికి ఏ అసెంబ్లీ స్థానం కేటాయిస్తారా అనే చర్చ నడుస్తోంది. బిజెపికి టిక్కెట్ కేటాయిపు తర్వాత సైతం అసమ్మతి సెగలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇరుపార్టీల్లో అసమ్మతి నేతలను బుజ్జగించి దారిలోకి తెస్తారో.. లేక ఇబ్బందులు తప్పవో అనే చర్చ పెద్దఎత్తున సాగుతోంది.

తాడేపల్లిగూడెం సమావేశంలో మాట్లాడుతున్న ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ

టిక్కెట్ ఇవ్వకపోవడం బాధగా ఉంది

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వచ్చే ఎన్నికల్లో పొత్తులో భాగంగా జనసేనకు తాడేపల్లిగూడెం సీటు కేటాయించి తనకు టిక్కెట్ ఇవ్వకపోవడం బాధగా ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మాగంటి కళ్యాణ మండపంలో శనివారం టిడిపి నియోజకవర్గ విస్తృత సమావేశం నిర్వహించారు. తొలుత బాబ్జీ మాట్లాడుతూ అధిష్టానం తాడేపల్లిగూడెం సీటు గురించి ముందుగానే చెప్పి ఉంటే బాగుండేదన్నారు. 2021లో తనను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించినప్పటి నుండి ఇప్పటి వరకూ తనకు అప్పగించిన ప్రతి పనిని బాధ్యతతో పూర్తి చేశానని తెలిపారు. అందరికీ న్యాయం చేస్తామని అధిష్టానం మాట ఇచ్చిందని, కార్యకర్తలు సంయవనం పాటించాలని, అధిష్టానాన్ని కించపరిచేలా ఎవరు వ్యవహరించొద్దని అన్నారు. పలువురు నేతలు, కార్యకర్తలు మాట్లాడుతూ జనసేనకు సీటు కేటాయించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. 2014లోనూ బిజెపికి సీటు ఇవ్వడం వల్ల ఏర్పడిన ఇబ్బందులను గుర్తు చేసుకున్నారు. బాబ్జీ వంటి మంచి మనిషిని మోసగించారన్నారు. ఏదేమైనా తామంతా బాబ్జీతోనే ఉంటామని, బాబ్జీ తీసుకునే ఏ నిర్ణయానికైనా తాము కట్టుబడి ఉంటామని తెలిపారు. సమావేశంలో టిడిపి మండలాధ్యక్షులు పరిమి రవికుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గొర్రెల శ్రీధర్, నేతలు ముత్యాల సత్యనారాయణ, కిలపర్తి వెంకట్రావు, గంధం సతీష్, దాసరి అప్పన్న, పెదతాడేపల్లి సర్పంచి పోతుల అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న సూరీడు..!

ఉక్కబోతతో జనం ఉక్కిరిబిక్కిరి
ఉపశమనాల వైపు జనం పరుగులు
తల్లడిల్లుతున్న చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు
సాధారణం కంటే 3-4 డిగ్రీలు అధికం
త్వరలో 40 డిగ్రీలకు చేరువయ్యే అవకాశం

పాలకోడేరులో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

ప్రజాశక్తి - భీమవరం

వాతావరణం వేడెక్కుతోంది. వేసవి ప్రారంభంలోనే సూరీడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండ తీవ్రత, ఉక్కబోతతో జిల్లా ప్రజానీకం అల్లాడుతోంది. దీంతో జనం ఉపశమనం వైపు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తల్లడిల్లుతున్నారు. రోజురోజుకీ ఎండతీవ్రత పెరుగుతుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. సాధారణం కంటే 3-4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొద్దిరోజుల్లోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువయ్యే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించడం జనాలను ఆందోళనకు గురిచేస్తోంది.

దాదాపు 15 రోజులుగా వాతావరణం రాత్రి మంచు, పగలు వేడిమిగా ఉంది. ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతోపాటు పొగమంచు కురవడంతో పగటి ఉష్ణోగ్రతలు పెద్దగా ఇబ్బంది పెట్టలేదు. వాస్తవానికి ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండల ప్రభావం కన్పించింది. దాదాపు వారం రోజులపాటు పలుచోట్ల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3-5 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. జిల్లాలో 33 నుంచి 35 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. ప్రస్తుతం ఉత్తర భారతదేశంపై వెస్టర్న్ డిస్టర్బెన్స్ (పశ్చిమ ఆటంకాల) ప్రభావం కొనసాగుతోంది. సాధారణంగా ఈ సమయంలో ఇవి ఉత్తర భారతదేశంపైనే కొనసాగుతాయి. అయితే ఇప్పుడు దక్షిణ భారతదేశంవైపు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ వైపు కదులుతున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ఉదయం, రాత్రి వేళల్లో కొద్దిసేపు మేఘాలు ఆవరించి చల్లదనం ఏర్పడినా.. మధ్యాహ్నం మాత్రం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రతకు జనం రోడ్లపైకి వచ్చేందుకు వెనుకాడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎండ తీవ్రతకు ఉక్కబోత తోడవ్వడంతో జనం తల్లడిల్లుతున్నారు. దీనికితోడు విద్యుత్ కోతలు అధికం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజానీకం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. శీతల పానీయాల వైపు పరుగులు పెడుతున్నారు. ముఖ్యంగా వివిధ రకాల పండ్ల జ్యూసులతోపాటు, ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింకులు తాగేందుకు మక్కువ చూపుతున్నారు.

గత నెలలోనే రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు

సాధారణంగా మే నెల వస్తేనేగాని ఎండల తీవ్రత అంతగా కన్పించేది కాదు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఎండలు మండాయి. పసిఫిక్ మహా సముద్రంలో గతేడాది ప్రారంభమైన ఎల్‌నినో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో గరిష్ట స్థాయికి చేరింది. దీనిని వాతావరణ నిపుణులు సూపర్ ఎల్‌నినోగా పేర్కొంటున్నారు. ఎల్‌నినో కారణంగానే 2023 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది. ఎల్‌నినో కొనసాగుతున్నందున ఈ ఏడాది జనవరితోపాటు ఫిబ్రవరిలో కూడా రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 1991-2020 మధ్య నమోదైన ఉష్ణోగ్రతల సగటును పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది ఫిబ్రవరిలో 0.81 డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదైంది. దీంతో ఫిబ్రవరిలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదైనట్లు యూరప్‌లోని కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ తెలిపింది. గతంలో 2015 చివరిలో పసిఫిక్ సముద్రంలో సూపర్ ఎల్‌నినో ఏర్పడటంతో 2016 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది.

40 డిగ్రీలకు చేరే అవకాశం

ద్రోణి, ఉపరితల ఆవర్తనాలు బలహీన పడటంతో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రభావం కన్పిస్తోంది. కొన్నిచోట్ల సాధారణం కంటే 3-4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గడిచిన 24 గంటల్లో జిల్లాలో 33 నుంచి 37 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. మరికొద్ది రోజుల్లో కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మార్చి ఆరంభంలోనే ఈ పరిస్థితి తలెత్తడం అసాధారణమేనని వీరు చెబుతున్నారు. అయితే కొద్దిరోజులపాటు జిల్లాలో ఉష్ణతాపం, ఉక్కపోతతో కూడిన అసౌకర్య వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

జగన్‌కు ప్రజా కోర్టులో శిక్ష తప్పదు

టిడిపి నేత, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర (ఆచంట)

జగన్ దుర్మార్గ పాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజాకోర్టులో శిక్ష తప్పదని మాజీ మంత్రి, టిడిపి నేత పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం పెనుమంట్ర మండలం పొలమూరులో 'ప్రజల వద్దకు పితాని' పేరిట ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని కొందరు వైసిపి నేతలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వాలంటీర్లు ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవద్దని సూచించారు. వాలంటీర్లు ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ వంటి వాటిలో భాగస్వాములైతే చర్యలు తప్పవన్నారు. రాత్రికి రాత్రే వైసిపి నేతలు పెనుమంట్ర మండలం బ్రహ్మణచెర్వులో పేదల స్థలాలను ఆక్రమించారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులను సైతం లెక్క చేయకుండా ఎంఎల్ఎ రంగరాజు అనుచరులు ఇష్టారాజ్యంగా భూదందాలకు, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఎంఎల్ఎ రంగరాజు అధికార దుర్వినియోగం, నియోజకవర్గంలో స్థలాల అమ్మకాలపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో చెత్త సేకరించలేని చెత్త ప్రభుత్వమని నిప్పులు చెరిగారు. అర్హులకు పింఛన్లు, అమ్మఒడి, ఇళ్ల స్థలాలు కేటాయించకపోవడం దారుణమన్నారు. పొలమూరు పంచాయతీలో రూ.50 లక్షల నిధులు దుర్వినియోగంపై జనసేన నేతలు ఫిర్యాదు చేసినా అధికారులు కనీస చర్యలు తీసుకోలేదని, తమ ప్రభుత్వం రాగానే సమగ్ర విచారణ చేసి నిగ్గు తేలుస్తామని అన్నారు. కార్యక్రమంలో నేతలు రుద్రరాజు వెంకటరామరాజు, వెలగల బులిరామరెడ్డి, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు వెంగళదాసు దానయ్య, మాజీ సర్పంచి చింతపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొలమూరులో పాదయాత్రలో మాట్లాడుతున్న పితాని సత్యనారాయణ

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్గి ఉండాలని, నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో శనివారం సాధారణ ఎన్నికలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రవర్తనా నియమావళి పరిధిలోకి వస్తారన్నారు. ఏమైనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకొచ్చి నివృత్తి చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ఎన్నికల్లో ఏమి చేయాలి, ఏమి చేయకూడదు అనే అంశాలపై పూర్తి స్పష్టత ఉండాలన్నారు. ఎన్నికల్లో నామినేషన్ ప్రక్రియ చాలా ముఖ్యమైందన్నారు. ఇవిఎంలపైనా పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఇవిఎంలు, మాక్ పోల్, ప్రొసీజర్స్, పోల్ డే రోజు ఏం చేయాలి అనే దానిపై సందేహాలు లేకుండా పూర్తి స్పష్టతతో ఉండాలన్నారు. ఎన్నికల కోసం సెంట్రలైజ్డ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని, సోషల్ మీడియా సెల్, మీడియా మోనిటరింగ్ సెల్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్, సువిధ, సి-విజిల్ యాప్‌ల గురించి, ఐటి అప్లికేషన్స్‌పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ శివన్నారాయణరెడ్డి, రిటైర్డ్ ఆర్‌డిఒ, మాస్టర్ ట్రైనర్ ఎం.చక్రపాణి, భీమవరం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, కె.చెన్నయ్య, జిల్లా శిక్షణ నోడల్ అధికారి కెసిహెచ్.అప్పారావు, అధికారులు వి.స్వామినాయుడు, జెడ్.వెంకటేశ్వరరావు, సిహెచ్.దుర్గా ప్రసాద్, ఎం.సన్యాసిరావు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు గూడూరి జగదీష్, కామన నాగేశ్వరరావు (వైసిపి), మరపట్ల శ్యాంబాబు, కొట్టి నరసింహామూర్తి (టిడిపి,) బి.బలరాం (సిపిఎం), ఆరేటి మృత్యుంజయరావు (సిపిఐ), వై.దేవేంద్రఫణికర్ (జనసేన), గంజి మురాజ్జీరాజు (రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా), అర్జునరావు (కాంగ్రెసు), పి.నాగేశ్వరరావు (బిజెపి), కాటూరి కరుణాకర్, గొట్టుముక్కల శివాజీ (బిఎస్‌పి) పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

టిడిపి నేత పాలి ప్రసాద్ మృతి

పలువురి సంతాపం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి పాలి సత్యనారాయణవరప్రసాద్(71) అనారోగ్య కారణాలతో శనివారం సాయంత్రం ఐదు గంటలకు మృతి చెందారు. పాలి ప్రసాద్‌గా సుపరిచితులైన ఆయన 40 ఏళ్లుగా టిడిపికి ఎనలేని సేవలందించారు. కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీలో చేరిన ఆయన ఎన్‌టి.రామారావుకు నమ్మిన బంటుగా ఉంటూ ఎంతమందిలో ఉన్నా ప్రసాద్ అని పేరు పెట్టి పిలిచే స్థాయి గుర్తింపు తెచ్చుకున్నారు. 1984లో ఎన్‌టి.రామారావు ప్రభుత్వంలో పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా పని చేసిన ఆయన అనంతరం టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శిగా పనిచేస్తూ వచ్చారు. 2014లో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రెండేళ్లు రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేశారు. రెండేళ్ల క్రితం ఆయన భార్య నిర్మలకుమారి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. వారికి పిల్లలు లేకపోవడంతో ఒక బాలికను పెంచుకుంటున్నారు. ప్రస్తుతం ఆ బాలిక ఇంటర్మీడియట్ చదువుతుంది. గత ఫిబ్రవరి 28వ తేదీన తాడేపల్లిగూడెంలో జరిగిన జనసేన, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి జెండా సభకు వెళ్లిన ఆయనను ప్రత్తిపాడు వద్ద వాహనం ఢీ కొనడంతో తుంటి ఎముక విరిగింది. దీంతో వారం రోజుల క్రితం ఆయనకు ఏలూరులోని మహాలక్ష్మి ఆసుపత్రిలో ఆపరేషన్ చేసి చికిత్స అందిస్తున్నారు. శనివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆయన ఆరోగ్యం విషమించటంతో మృతి చెందారు. పాలి ప్రసాద్ మృతి పట్ల టిడిపి జిల్లా నాయకులు గన్ని వీరాంజనేయులు, బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్‌తో పాటు పలువురు నాయకులు తమ సంతాపాన్ని తెలిపారు.

దగ్గులూరులో ఎంఎల్ఎ నిమ్మల ప్రచారం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

'మన పాలకొల్లు మన రామానాయుడు' ఇంటింటి పాదయాత్రలో భాగంగా శనివారం దగ్గులూరు గ్రామంలో జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామానాయుడు మాట్లాడుతూ దగ్గులూరు గ్రామంలో బిసి సామాజిక వర్గాలైన వీవర్స్, గౌడ శెట్టిబలిజ, ఇతర వర్గాలు టిడిపి, జనసేన అధికారంలోకి రావాలంటూ బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. టిడిపి, జనసేనకు 80 శాతం బీసీల మద్దతు ఉందని తెలిపారు. జగన్‌ను సాగనంపేందుకు అన్ని వర్గాల ప్రజలూ సిద్ధంగా ఉన్నారన్నారు. పాదయాత్రలో నాయకులు అందే కోటి వీరబద్రం, శాగ సత్యనారాయణ, విజయ భాస్కర్ పాల్గొన్నారు.

14న చలో ఢిల్లీకి మద్దతు తెలపండి

సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 14న ఢిల్లీ రామ్‌లీల మైదానంలో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు, వ్యవసాయ కార్మిక, కౌలురైతు, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు, రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం భీమవరం ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం నిర్వహిచారు. సమావేశంలో జిల్లాలో నాలుగు ప్రచార యాత్రల ద్వారా ఈ నెల 11న ప్రచారం చేయాలని నిర్ణయించింది. ఒక ప్రచార యాత్ర భీమవరం అంబేద్కర్ చౌక్ నుండి, మిగిలినవి నరసాపురం, ఆచంట, తాడేపల్లిగూడెంల్లో ప్రారంభమై అన్ని మండలాలు, పట్టణాల్లో ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 14న జిల్లా కేంద్రంతోపాటు అన్ని పట్టణ, మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం పిలుపునిచ్చింది. సమావేశంలో రైతు సంఘం నాయకులు ఆకుల హరేరామ్, చింతకాయల బాబూరావు, సిఐటియు నాయకులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతు సంఘం నాయకులు మామిడిశెట్టి రామాంజనేయులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే మహిళా దినోత్సవం

ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ

ప్రజాశక్తి - ఆకివీడు

పురుషులతో సమానంగా స్త్రీకి గుర్తింపు లేని సమాజంలో స్త్రీ సమానత్వం కోసం చేసిన పోరాట ఫలితంగా ఏర్పడింది మహిళా దినోత్సవమని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ వివరించారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రజాతంత్ర మహిళా సమాఖ్య పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో మహిళా సదస్సు నిర్వహించారు. ఐద్వా పట్టణ కార్యదర్శి సందక ఉదయ కుమారి అధ్యక్షతన జరిగిన సదస్సులో జిల్లా కార్యదర్శి పి.పూర్ణ పాల్గొని మాట్లాడారు. యూరప్ ఖండంలోని అమెరికా, రష్యా తదితర దేశాల్లో స్త్రీని తక్కువగా చూడడంతో ఈ ఉద్యమం ప్రారంభమైందన్నారు. ఎందరో పోరాటాలు, త్యాగాలు, కన్నీటిగాథల అనంతరం ఈ మహిళా దినోత్సవం యూరప్ దేశాలలో ప్రారంభమైందన్నారు. అనంతరం బృందాకరత్ రచించిన 'రీటా నేర్పిన పాఠం' పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. జిల్లాలో ఈ పుస్తకాన్ని మొదటిసారిగా ఆవిష్కరిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు ఆర్‌జి.లక్ష్మి, జి.లావణ్య, రాణి పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు

విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సాహం అవసరం

సీనియర్ క్రీడాకారిణి సత్తి గీత

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్య అంటే చదువు, క్రీడలు, కళలు, సాహిత్యం అన్నీ అని, చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం సంపాదించాలని సీనియర్ క్రీడాకారిణి సత్తి గీత అన్నారు. శనివారం రాత్రి పాలకొల్లులోని యూరో కిడ్స్ వార్షికోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ గతంలో క్రీడల పట్ల అశ్రద్ధ ఉండేదన్నారు. ప్రస్తుతం అనేక రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రోత్సాహం ఇస్తున్నాయన్నారు. దీంతో అంతర్జాతీయ ఒలింపిక్స్‌లో కూడా మనం ఇతర దేశాలతో పతకాలకు పోటీ పడుతున్నామని చెప్పారు. తాను క్రీడల కోటాలోనే ఉద్యోగం సంపాదించి ఈ స్థాయికి వచ్చానని ఎంఇఒ గుమ్మళ్ల వీరాస్వామి చెప్పారు. విద్యార్థులు అన్ని రంగాల్లో తమ నైపుణ్యం ప్రదర్శించాలన్నారు. వారి ఆసక్తి బట్టి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. స్కూల్ కరస్పాండెంట్ రాజేష్, ప్రిన్సిపల్ పద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకర్షించాయి.

పాలకొల్లులో యూరో కిడ్స్ వార్షికోత్సవంలో పాల్గొన్న సత్తి గీత

మృతుల కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులో మరణించిన పేద కుటుంబాలకు దాట్ల వెంకట రామరాజు అండగా ఉంటూ దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందించడం హర్షణీయమని ఈదా భోగేష్ అన్నారు. కాళ్లకూరులో ఇటీవల మరణించిన బండేటి గోవిందరావు (48), పల్లికొండ సుధీర్ (38) కుటుంబ సభ్యులకు దాట్ల శ్రీదేవి ట్రస్టు ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని శనివారం భోగేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా భోగేష్ మాట్లాడుతూ మరణించిన వారి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు అందించి దాట్ల వెంకట రామరాజు మానవత్వాన్ని చాటుకుంటున్నారని తెలిపారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న భోగేష్

కొప్పర్తికి రసధుని సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పెద్దిభొట్ల బ్రహ్మయ్య స్మారక రసధుని సాహితీ పురస్కారానికి ప్రముఖ సాహిత్య విశ్లేషకులు కొప్పర్తి వెంకట రమణమూర్తి ఎంపికయ్యారు. ఈ నెల 17వ తేదీ ఆదివారం పాలకొల్లు లయన్స్ క్లబ్ లో జరిగే రసధుని సాహిత్య సభలో రమణమూర్తికి అవార్డు, నగదు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో రసధుని గౌరవాధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ, కొట్ని భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి జె.దుర్గారావు, యర్రంశెట్టి శేషగిరిరావు, చేగొండి.రంగారావు, ప్రభాకర్ శాస్త్రి, ఎల్.బి.కె.మూర్తిరాజు మామిడిశెట్టి శ్రీనివాస్, మాడభూషి కృష్ణప్రసాద్, ఉద్దరాజు పెద్దిరాజు, కోలటి పెద్దిరాజు పాల్గొంటారు.

కొనసాగిన జూనియర్ ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - నరసాపురం

ఇంటర్ ప్రథమ సంవత్సరం మాథ్స్ -1బి, జువాలజీ -1, హిస్టరీ-1 పరీక్షలు శనివారం జరిగాయి. నరసాపురంలో ఆదిత్య, వైన్ డైమండ్ జూబ్లీ, శ్రీసూర్య ఉమెన్స్, గౌతమి, భాస్కర కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బిజిబిఎస్ ఉమెన్స్ కళాశాలలో 267 విద్యార్థులకు గాను 255 మంది విద్యార్థులు హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు.

ఉండి : ఎండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షల్లో మ్యాథ్స్ 1బికి 114 మంది విద్యార్థులకు 111 మంది, జువాలజీ 32 మందికి 31 మంది, హిస్టరీ సంబంధించి ఒక విద్యార్థి, ఒకేషనల్ పరీక్షకు సంబంధించి 18 మంది విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ పెద్దిరాజు తెలిపారు. తమ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని డిఐఈఒ నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు పెద్దిరాజు తెలిపారు.

పలువురికి ముదునూరి పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

ఇటీవల అనారోగ్యానికి గురైన వేములదీవి వెస్ట్ గ్రామానికి చెందిన మైల శేషయ్య, తిరుమాని అశ్వినిని రాష్ట్ర ప్రభుత్వ విప్ వైసిపి ముదునూరి ప్రసాదరాజు పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన వేములదీవి వెస్ట్ గ్రామానికి చెందిన ఉంగరాల ధనలక్ష్మి, గుత్తుల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను ప్రసాదరాజు పరామర్శించారు. అనారోగ్యంతో మరణించిన పట్టణంలోని 8వ వార్డుకు చెందిన తిరుమాని షణ్ముఖ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చెరువు తవ్వకం పనులను పరిశీలిస్తున్న ఉప సర్పంచి, ఎంపిటిసి

యుద్ధ ప్రాతిపదికన తాగునీటి చెరువు పనులు

ప్రజాశక్తి - కాళ్ల

నీటి వనరుల పరిరక్షణకు జువ్వలపాలెం పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించింది. జువ్వలపాలెంలోని ప్రధాన తాగునీటి చెరువు పూడుకుపోయింది. చెరువును యుద్ధ ప్రాతిపదికన తవ్వించడంతో పాటు నీటి నిల్వల ఏర్పాటుకు ప్రాధాన్యతిస్తోంది. పంచాయతీ నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. తాగునీటి చెరువు తవ్వకం పనులను గ్రామ ఉప సర్పంచి కారరి లక్ష్మీపతిరాజు, ఎంపిటిసి మీసాల శ్రీను శనివారం పరిశీలించారు. చెరువును పునరుద్ధరించే పనులు చేపడుతున్నట్లు గ్రామ కార్యదర్శి రామకృష్ణంరాజు తెలిపారు. చెరువులోని మట్టిని పూర్తిస్థాయిలో తొలగించి వంతుల వారీగా చెరువును పూర్తిస్థాయిలో నీటితో నింపనున్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతి నెలా సరుకులు పంపిణీ చేసేందుకు ముందుకు రావడం మంచి పని అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శనివారం పట్టణంలో ఎన్ఆర్ఐ నూర్ మహమ్మద్ ఆర్థిక సహాయంతో పేదలకు కిరాణా సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొత్తూరి రామరాజు పాల్గొని పేదలకు సరుకులు పంపిణీ చేసి మాట్లాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ యూనిస్ బేగం, అంటే రామకృష్ణ, కాశీ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - పెనుగొండ

విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ద్వారా సేవలందించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవిఎ.అప్పారావు తెలిపారు. వడలిలో ఏడు రోజుల పాటు నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్ క్యాంపును శనివారం ప్రిన్సిపల్ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ షేక్ మోసుభాషా, సిఐ ఎన్.రజనీ కుమార్ మాట్లాడారు. కొత్తగా ఓటు వేసే వారు, ఓటు వెయ్యని వారు ప్రలోభాలకు లొంగొద్దన్నారు. కార్యక్రమంలో వడలి సర్పంచి పెద్దిరాజు, సెక్రటరీ రామకృష్ణ, ఎస్.గణేశ్వరరావు, వివిఆర్ఒ సాయి, ఎంపిటిసి సిహెచ్.బాబి ఎంపిటిసి రెడ్డి గణేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి - అత్తిలి

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు స్థానిక యూనియన్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు ప్రిన్సిపల్‌గా మమత, శాంత కుమారి వ్యవహరించారు. హెల్పర్లు ఉద్యమ స్ఫూర్తిని నిర్వహించి కె.ధనలక్ష్మి పోరాటాలు, ఉద్యమాలు ప్రాముఖ్యతను వివరించారు. 42 రోజుల సమ్మెలో ఎదుర్కొన్న ఆటంకాలు, ఇబ్బందులు, సాధించిన విజయాలను వివరించారు. సిఐటియు మండల కార్యదర్శి పివి ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, హసీనా, కౌలు రైతు సంఘం నాయకులు కేతా గోపాలన్, సిఐటియు మండల కార్యదర్శి ధర్మేంద్ర, పి.మాధవి, సత్యవతి నాయకత్వం వహించారు.

కుటుంబ విలువలు కాపాడాలి

నరసాపురం:కుటుంబ విలువలు కాపాడుతూ మహిళలు సేవ చేయాలని కావ్య వనిత క్లబ్ రీజనల్ ఛైర్పర్సన్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని అల్లూరి సత్యనారాయణ కళ్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలను నిర్వహించి సత్కరించారు. వనిత క్లబ్ అధ్యక్షులు కుసాపాల ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజ్యలక్ష్మి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఉషా కమల, సెక్రటరీ బండి సర్వలత, కోశాధికారి రంగినీడి భారతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మేమున్నాం.. ధైర్యంగా ఓటేయండి

భీమవరం రూరల్ సిఐ సత్య కిషోర్

ప్రజాశక్తి - పాలకోడేరు

రాబోయే సాధారణ ఎన్నికల్లో ప్రజలకు అండగా తామున్నామని, ధైర్యంగా ఓటు వేయాలని భీమవరం రూరల్ సిఐ వై.సత్యకిషోర్ అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలనే ముఖ్యోద్దేశంతో పాలకోడేరు పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శృంగవృక్షంలో 70 మంది ప్రత్యేక కేంద్ర బలగాలతో భారీ కవాతు శనివారం నిర్వహించారు. శృంగవృక్షం మెయిన్ సెంటర్‌తో పాటు కాపుల రామాలయం, బంటుమిల్లి, ఉండ్రు, తాడి, సబితి, పాలపర్తి, దుండిపేట ప్రాంతాల్లో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర కవాతు చేసి ప్రజలకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సిఐ సత్య కిషోర్ మాట్లాడారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనున్నామన్నారు. ప్రజలు ఎటువంటి అపోహలకు పోకుండా ధైర్యంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అన్ని చర్యలూ చేపట్టామన్నారు. ఎస్ఐ నాలం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేల గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ఎన్నికలు సహజంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని లేనిపక్షంలో సంబంధిత వారిపై చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, సిఆర్‌ఎఫ్ బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవృక్షంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ముగిసిన ఆరిమిల్లి పాదయాత్ర

ప్రజాశక్తి - తణుకు

మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ చేపట్టిన భవిష్యత్తు కోసం సకల జనుల చైతన్య పాదయాత్ర శనివారం వేల్పూరు గ్రామంలో ముగిసింది. ఫిబ్రవరి 20న కెవెస్ సముద్రపు గట్టు నుంచి రాధాకృష్ణ పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. 16 రోజులపాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కాలినడకన తిరుగుతూ ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు కోసం నిర్వహించిన పాదయాత్ర లక్ష్యం నెరవేరిందన్నారు. నియోజవర్గంలోని తణుకు రూరల్ మండలం, ఇరగవరం, అత్తిలి మండలం, తణుకు పట్టణంలో పాదయాత్ర జరిగిందన్నారు. నాలుగున్నర సంవత్సరాల వైసిపి అసమర్థ అరాచక పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి ఉందన్నారు. ఎస్‌సి, బిసి కాలనీలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి ఆ వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు శ్రద్ధ తీసుకున్నట్లు చెప్పారు. పాదయాత్ర సందర్భంగా ఆయా గ్రామాల్లో రాత్రిపూట పల్లెనిద్ర చేసి అక్కడ ప్రజలతో మమేకం అయినట్లు వివరించారు. పాదయాత్ర విజయవంతం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న రాధాకృష్ణ

3వ రోజు కొనసాగిన చలివేంద్రం

ప్రజాశక్తి - ఆచంట

సేవా దృక్పథంతో పాదచారుల దాహార్తిని తీర్చడమే ప్రజాసంఘాల ముఖ్యోద్దేశమని సిపిఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నర్సింహమూర్తి అన్నారు. ఆచంట కచేరీ సెంటర్లో మహాశివరాత్రి సందర్భంగా వచ్చే యాత్రికుల కోసం నెక్కంటి రామదాసు అన్నపూర్ణమ్మ స్మారకార్థం సిఐటియు, యుటిఎఫ్, డివైఎఫ్ఐ, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం మూడో రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేసి పాదచారుల దాహార్తిని తీరుస్తూ ముందుకెళ్తున్నామన్నారు. దాతలు ముందుకు రావడంతో మూడు రోజులుగా సేవా కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పరువు మోహన్‌రావు, కుసుమే జయరాజు, మానుకొండ రాంబాబు, అండ్రు రామారావు, బొర్రా ధర్మారావు, తలుపురి బుల్లబ్బాయి, కరిణ బెంజిమెన్, సత్యనారాయణ, రాధాకృష్ణ, వీరబ్రహ్మం, విగ్నేశ్వరుడు పాల్గొన్నారు.

విరి కేదారం పుస్తకావిష్కరణ చేస్తున్న ఆలయ కమిటీ

'విరి కేదారం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణానికి చెందిన కవి, రచయిత చిలకమర్తి సుబ్రహ్మణ్యం శాస్త్రి స్వీయ రచనలో రూపుదిద్దుకున్న 'విరి కేదారం' పుస్తకావిష్కరణ శనివారం వేములదీవి గ్రామం శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగింది. ఆలయ కమిటీ సభ్యుడు చెన్నాప్రగడ చక్రధరరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవి ఇందుకూరి లక్ష్మీపతి రాజు పుస్తక సమీక్ష నిర్వహించారు. చిలకమర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి ఇప్పటివరకూ ఆమని, వెన్నెల వాన, హరివిల్లు పాంచజన్యం వంటి ఖండకావ్యాలను రచించారు. అలాగే అష్టావధానం, శతవధానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య శాస్త్రిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఉంగరాల రమేష్, వేములదీవి మాజీ సర్పంచి అడ్డాల శ్రీనివాస్, కోటిపల్లి ఆనందరావు, చాగంటి ఆనంద్, అడ్డాల నాగేశ్వరరావు, దేవి రెడ్డి రామకృష్ణ ఇంటి మోహనరావు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - ఉండి

మహిళాభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వాండ్రం గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ అన్నారు. శనివారం వాండ్రం గ్రామ పంచాయతీలో నిర్వహించిన రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి దాసరి వెంకటకృష్ణ మాట్లాడుతూ జగనన్న లే అవుట్‌కు సంబంధించి ఇంటి పట్టాలను ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వంచే రిజిస్ట్రేషన్ చేయించి లబ్ధిదారులకు ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తూ ప్రతి సంక్షేమ పథకాన్నీ స్త్రీలకు అనుసంధానం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి ముదుండి స్వరూప శ్యామ్, మాజీ సర్పంచి యాడంగి ఏసు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జడ్డు వెంకట తాత నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా రామేశ్వరస్వామి ఉత్సవాలు

ఆచంటలో కిక్కిరిసిన రోడ్లు

ప్రజాశక్తి - ఆచంట

రామేశ్వరస్వామి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన యాత్రికులు సందర్శకులతో శనివారం ఆచంట కిటకిటలాడుతోంది. స్థానిక కచేరీ సెంటర్ నుంచి ఆలయం వరకూ రహదారి యాత్రికులతో కిక్కిరించిపోయింది. స్వామివారిని యాత్రికులు సందర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు చేశారు. స్వామివారి కళావేదిక వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాల్లో కొనుగోలుదారుల సందడి నెలకొంది. యాత్రికులకు అన్నదాన కమిటీ అన్న సమారాధన ఏర్పాటు చేసింది. ఆచంట ఎస్ఐ రాజకుమార్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆచంట వేమవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి రామచంద్ర కుమార్, ఆలయ ఛైర్మన్ బుద్ధి రాజ్ విద్యాసాగర్, సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదిత్యలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆదిత్య డిగ్రీ కాలేజీలో శనివారం ప్రముఖ ఎంఎన్‌సియుఎల్‌ఎర్న్ కంపెనీ వారు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో జిల్లాలోని అన్ని ఆదిత్య డిగ్రీ కళాశాలలకు చెందిన సుమారు 700 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం రావడం కష్టంగా ఉందని, ఆదిత్యలో ప్రతిరోజూ విద్యార్థులకు తాము నిర్వహించే సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ శిక్షణా తరగతుల మూలంగానే ఇది సాధ్యపడుతోందన్నారు. ఈ ఉద్యోగానికి సుమారు సంవత్సరానికి రూ.5.2 లక్షల జీతం ఉంటుందని తెలిపారు. ఉద్యోగాలు కల్పించడానికి తమ యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆదిత్యలో చదివితే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, ప్లేస్మెంట్ అధికారులు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీసరోజ

నేడు ఐదు, ఇంటర్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష

నరసాపురం : అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలురు), ఎల్‌బిచర్ల నరసాపురంలో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈనెల 10వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ మానేపల్లి రాధాకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకూ 5వ తరగతికి ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకూ ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షలకు ఎల్‌బిచర్ల సెంటర్‌లో మొత్తం 201 మంది ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం 5వ తరగతికి 80 సీట్లు, ఇంటర్ ఎంపిసిలో 40, బైపిసిలో 40 సీట్లకు ప్రవేశాలు జరుగుతున్నట్లు తెలిపారు.

దాళ్వాకు సాగునీరందించాలి

మొగల్తూరు:దాళ్వాకు వెంటనే సాగునీరందించాలని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొగల్తూరులోని 45 డిపి ఆయకట్టులోని వరి చేలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల కాలంలో కనీసం పంట బోదెలను ప్రక్షాళన చేయలేదని విమర్శించారు. దాళ్వా సాగులో రెండుసార్లు వరిచేలకు తడులు అందిస్తే అన్నదాతలకు పంట చేతికొస్తుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, కలిదిండి కుమార్ బాబు, మామిడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణం

ప్రచారంలో నిమ్మల సూర్యకుమారి

ప్రజాశక్తి - పాలకొల్లు

అధికారంలోకి రాబోయే టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వంలో మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం అమలవుతుందని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి తెలిపారు. ఆమె శనివారం మన పాలకొల్లు మన రామానాయుడులో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలతో కలిసి ఇంటింటికి వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి ప్రజల కోసం పనిచేసే ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును మంచి మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. రాబోయే టిడిపి, జనసేన హయాంలో ఏడాదికి 3 ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు, కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 చొప్పున లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కర్నేన గౌరునాయుడు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి పేచెట్టి బాబు, పట్టణ టిడిపి అధ్యక్షులు తమ్మినిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లులో ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎల్ఎ సతీమణి

పలు చోట్ల అన్న సమారాధనలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరంలో చాలా ఏళ్లుగా అన్నసమారాధన నిర్వహిస్తున్న సాగిరాజు సుబ్బరాజు, వరలక్ష్మి దంపతులు ధన్యులని అఖిల భారత హేండ్‌లూమ్స్ బోర్డు మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం స్థానిక శివాలయం వద్ద జరిగిన భారీ అన్న సమారాధనను లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ దెందుకూరి ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామలింగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సరిపల్లి కమల, దెందుకూరి మురళీ, ఎస్‌పి.మురళి పాల్గొన్నారు.

పాలకోడేరు : పాలకోడేరులోని సుబ్రహ్మణ్యపురం వద్ద రాజరాజేశ్వరి సమేత ముక్తేశ్వర స్వామిస్వామివారిని రుద్రాక్షలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడారు. కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన పెద్దలకు, దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మొగల్తూరు : మొగల్తూరులోని ఆత్రేయ జ్యోతిష్యాలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. మహాశివరాత్రి పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శనివారం అన్నదానం నిర్వహించారు.

కెపిపాలెం సౌత్‌లో జనంలోకి జనసేన

మొగల్తూరు:వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన నర్సాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. కెపి.పాలెం సౌత్‌లోని అల్లంవారి మెరక నుండి కెపిపాలెం హైస్కూల్ సెంటర్ వరకూ శనివారం 'జనంలోకి జనసేన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జనసేన సిద్ధాంతాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కొల్లాటి గోపీకృష్ణ, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, గుబ్బల మార్రాజు, నిప్పులేటి తారకరామారావు, బొక్కా చంటి పాల్గొన్నారు.

'అభయహస్తం' యాప్ ఆవిష్కరణ

కాళ్ల:కాంగ్రెస్ దేశంలో, ఆంధ్ర రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ప్రతి పేద కుటుంబానికి ఆర్థికంగా ఆదుకోవడానికి రూ.5 వేలను అందించాలని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నిర్ణయించడం మంచి విషయమని నియోజకవర్గ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. కాళ్లకూరులో ఇందిరమ్మ అభయహస్తం పథకం యాప్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిల పిలుపుమేరకు ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని వేగేశ్న గోపాలకృష్ణంరాజు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా రాజేష్ కుమార్, జిల్లా కార్యదర్శి బి.పార్థు పాల్గొన్నారు.

యాప్ ఆవిష్కరిస్తున్న వెంకట గోపాలకృష్ణంరాజు

దస్తావేజు పోయినది

గణపవరం మండలం, గణపవరం గ్రామమునకు చెందిన చిన్న రామచంద్రపురంలో నాకు షేక్ ఆలీ సాహెబ్ గారి కుమారుడు షేక్ పీర్ బాష అను నాకు గణపవరం గ్రామం చిన్న రామచంద్రపురంలో (ఎస్ఆర్ఓ గణపవరంలో) **డాక్యుమెంటు నెంబరు 279/1999** లో సర్వే నెబర్ 62/2 లో 35.5 చదరపు గజాలు ఖాళీ స్థలం గల దస్తావేజులు గణపవరం సెంటర్‌లో జిరాక్స్ తీయించుకుని ఇంటికి తీసుకుని వచ్చే మార్గ మధ్యలో ఒరిజినల్ దస్తావేజులు ఉన్న కవర్‌తో సహా పడిపోయినవి. ఎంత వెతికిన దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన వారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

షేక్ పీర్ బాషా
తండ్రి: షేక్ ఆలీ సాహెబ్
గణపవరం గ్రామం, చిన్న రామచంద్రపురం
గణపవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 9701108145

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంప్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా పడాలలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం శనివారంతో ముగిసింది. స్థానిక ట్రినిటీ హాస్పటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్, డయాబెటిస్ వైద్య నిపుణులు డాక్టర్ ఎండి.ముంతాజ్, సిబ్బంది పాల్గొని శశి ఇంజినీరింగ్ విద్యార్థుల సహకారంతో గ్రామస్తులకు ఉచితంగా వైద్య సేవలందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ మాట్లాడుతూ వారం రోజులుగా విద్యార్థులు చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ గ్రామ సచివాలయం అధికారాలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కె. శ్రీనివాస్, డాక్టర్ ముంతాజ్ మాట్లాడారు. అనంతరం కార్యక్రమానికి సహకరించిన సచివాలయ సిబందిని, వైద్య బృందాన్ని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ, ప్రిన్సిపల్ మొహమ్మద్ ఇస్మాయిల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ షేక్ సల్మాన్ బాషా గ్రామస్తుల సమక్షంలో సన్మానించారు.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHIT'S AT NARASARAOPET.
Dispute No.121/2023

Between:-
M/S LAKSHMI TULASI CHIT FUND PVT LTD. NARASARAOPET, REP BY ITS FORE MAN/BRANCH MANAGER.
... Petitioner/Disputant
AND
Gurindapalli Jayaraju, And Others
.... Respondents/Opponents.

To,
Respondents/Opponents No.
2) Mallampalli siva Rama Prasad (age58y) S/o Venkat Ratnam,Occ: S.A,D.No:23A-6-40/2, Shankara Matam, R.R.Peta, Eluru, West Godavari-534001.

పై నెంబర్ పిటిషన్ నందు 2 వ రెస్పాండెంట్ అయిన మీకు పై పిటిషన్ లో శ్రీ కోర్టు వారి ద్వారా పలుమార్లు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది ఏమనగా పై పిటిషన్ లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల ది.16-03-2024 న ఉదయం 10:30 గం.ని లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు.
P.Chakrapani,
Advocate for Petitioner/Disputant
NARASARAOPET.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHIT'S AT NARASARAOPET.
Dispute No.111/2023

Between:-
M/S LAKSHMI TULASI CHIT FUND PVT LTD. NARASARAOPET, REP BY ITS FORE MAN/BRANCH MANAGER.
... Petitioner/Disputant
AND
Kondapalli Naga Venkata Aliya & Others
.... Respondents/Opponents.

To,
Respondents/Opponents No.
2) Mallampalli Siva Rama Prasad (age 58y) S/o Venkata Ratnam, Occ: School Assistant,D.No:23a-6-40/2,Shankara Matam,R.R.Pet,Eluru, West Godavari- 534001.

పై నెంబర్ పిటిషన్ నందు 2 వ రెస్పాండెంట్ అయిన మీకు పై పిటిషన్ లో శ్రీ కోర్టు వారి ద్వారా పలుమార్లు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడ మైనది ఏమనగా పై పిటిషన్ లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల ది.16-03-2024 న ఉదయం 10:30 గం.ని లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు.
P.Chakrapani,
Advocate for Petitioner/Disputant
NARASARAOPET.

In the Court of the Ist Addl. District Judge, Eluru
E.P. No. 7/2019 in O.S. No. 81/2013

Between:
Kuchipudi Phani Kumar
...Plaintif/D.Hr
AND
Pamarthi Jagadeesh
...Respondent/ J.Dr.

JDr: Pamarthi Jagadeesh, S/o. Govardhana Rao, Proprietor, Bommarillu Print Bazar, D.No. 28A-7-10, Rangam Palace Street, Ramachandrarao Peta, Eluru 537002, W.G.Dist.,

ప్రకటన

పై నెంబరు E.P. గ్రంథములో J.Dr. అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికినీ అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. పై నెంబరు గ్రంథము **ది. 28-03-2024వ తేదీకి వాయిదా అయివున్నది.** కావున సదరు తేదీన మీరు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, లేక మీ యొక్క ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో సదరు గ్రంథము మీ యొక్క పరోక్షములో తీర్మానింపబడును.

B.V.KRISHNA REDDY, Advocate
Eluru, Cell: 9848689999

నోటీసు
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 51/2023 in O.S. 25/2011

బిట్వీన్:
బండి ఆదిత్యప్రసాద్
-పిటీషనరు/వాది/డి. హెచ్. ఆర్.
మరియు
సత్తి సత్యవతి అండ్ అదర్స్
-రెస్పాండెంట్సు/ప్రతివాదులు/ జె.డి. ఆర్స్

టు:
3వ రెస్పాండెంటు/జె.డి.ఆర్:
గుడిమెట్ల రాజేశ్వరి, W/o. సత్యనారాయణ రెడ్డి, డో.నెం. 9-168, పెంటపాడు, పెంటపాడు మండలం, ప॥గో॥జిల్లా, TPG PJCJ.

పై నంబరు గల గ్రంథములో కోర్టు వారిచే పలుమార్లు మీకు నోటీసులు U/O 21, R 22 CPC ప్రకారము పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్య పూర్వకముగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము మీకు యిందుమూలముగా నోటీసు జారీ చేయడమైనది. **ది. 03-4-2024 ఉదయం 10.30 గం॥లు** లగాయితు పై కోర్టు వారి సమక్షములో స్వయముగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరయి మీ సంజాయిషీ తెలుపుకొనవలెనని, లేనియెడల మీ పరోక్షమున కోర్టు వారిచే తీర్మానము చేయబడును.

తోట వెంకట సత్యనారాయణ
వడ్లాని తేజ
తాడేపల్లిగూడెం — అడ్వకేట్స్, తాడేపల్లిగూడెం
ది. 9-3-2024 — సెల్: 9948243686